# కొత్తకథ

గుప్పెడు పుగాకుదుగ్గు నోట్లో వేసుకొని ఆకాశం వంక చూస్తూ నొసటు చిట్లించి ఆలోచనను ప్రారంభించింది డిటెక్టివ్ నల్లక్క. అద్భుతమూ, అపూర్వమూ, అనిర్వచనీయమైన ఆమె అపరాధ పరిశోధనలో తొలి క్షణం ప్రారంభమైంది. ఆమె అనుభవ పూరితమైన పరిశోధనకు కావలసిన సామాగ్రి బహు స్వల్పం. విలువైన గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లుకానీ, వేడి వేడి కాఫీ కానీ. గంటకు వందమైళ్ళ వేగంతో వెళ్లే మోటార్ సైకిల్‌గానీ, లేదా కనీసం ఒక థర్డు హేండ్ జీపుకారుకానీ ఆమెకు అవసరం లేదు.

డిటెక్టివ్ నల్లక్క నిరాడంబరపు మనిషి, అతి నిరాడంబరమైన స్త్రీ. ఆమె కాళహస్తి నేతచీర కట్టుకున్నది. కార్వేటి నగరం రవికె తొడుక్కున్నది. కానీ వెడల్పు కుంకుమ పెట్టింది. కొండంత కొప్పు పెట్టింది. ఆ కొప్పులో చేరెడు చేమంతి పూలు ముడుచుకొన్నది.

ముక్కుమీద వేలుంచి నత్తును అటూఇటూ కదిలిస్తూ ఎక్కడ పోయింది వుంగరం? ఎలా పోయిందా ముద్దుటుంగరం? అని దీర్ఘాలోచన ప్రారంభించింది.

ఆ వుదయం సరిగ్గా ఎనిమిది గంటలప్పుడు కొండారెడ్డిగారు తలంటు కొంటూ వసారాలోని కిటికీ దగ్గర వుంచాడా వుంగరాన్ని. వుంగరాన్ని అక్కడ వుంచినప్పుడు చూచిన వారు ఇద్దరు. తల అంటుతున్న చిక్కయ్య, నూనెగిన్నె తెచ్చిపెట్టిన మహాలక్ష్మమ్మ.

ఇద్దరిలో ఎవరో ఒకరు తీసి వుండాలి. మహాలక్ష్మమ్మ తీసివుంటే అసలు పేచీనే లేదు. ఇల్లాలు. సందేహమల్లా చిక్కయ్యమీదే.

అనుమానం ధ్రువపడడానికి సాక్షులు అవసరం లేదు. ఎంత మంచి వాడికైనా కాంతా కనకాలను చూస్తే మతి భ్రమిస్తుందని గతకాలం ఋజువు చేసిన సత్యం. అయినపుడు చిక్కయ్య ఎంతటి అమాయకుడైనా మరెంతటి మంచి వాడైనా సరే ఉంగరం కన్పించినపుడు సమయానికక్కడ ఎవరూ లేనప్పుడు

కాజేయడంలో ఆశ్చర్యమేముంది?

చిక్కయ్యే దొంగిలించాడు అని ఘంటాపథంగా అంటున్నాడు కొండారెడ్డి. కాదు అని చెప్పలేకపోతున్నది మహాలక్ష్మమ్మ.

దాసీ మనిషి నల్లక్క మాత్రం చిక్కయ్యను అనుమానించడం లేదు. ఆమెకు తెలుసు. ఎంత పేదతనమైనా చిక్కయ్య దొంగిలించడనీ అతనిలో నీతి నిజాయితీ వున్నదని. క్రితం ఒక్కసారి ఇలాగే ఆవులు మేపే సిద్ధయ్యను అనుమానించడం జరిగింది. అలాంటిదే ఈ వ్యవహారం కూడా అనుకున్నదామె.

కొండారెడ్డి చిక్కయ్యను పిలిపించి ఎముకలు గుల్లచేయిస్తానని బెదిరించాడు. ఒకటి రెండు దెబ్బలు కూడా తగిలించాడు. పాపం చిక్కయ్య ఆపాదమస్తకం వణికి పోతూ "ఆ ఏడు కొండలవాడి సాక్షిగా నేనేమీ ఎరుగను తండ్రీ" అంటూ బోరుమన్నాడు. అప్పుడే వచ్చిన కరణంగారు మాత్రం చల్లగా అన్నాడు సమస్యను సులభంగా పరిష్కరించడానికి పోలీసులకు కబురు చేయడమే మంచిదని.

పోలీసుల మాట వినగానే చిక్కయ్య గుండెలు పగిలిపోయాయి. చివరికి భార్యా పిల్లల్ని వదిలి జైలుకు వెళ్లవలసే గడియలు వచ్చాయని అతడు నిశ్చయించు కొన్నాడు.

అనుకొన్నట్లే కరణంగారు చిన్న రిపోర్టు తయారు చేశాడు. కొండారెడ్డి గారి బంగారు ముద్దుటుంగరాన్ని చిక్కయ్య దొంగిలించాడనీ ఋజువు కావడానికి ఆధారాలున్నాయనీ వెంటనే చర్య తీసుకోవాలనీ సబ్‌ఇన్‌స్పెక్టర్ గారికి కంప్లెయింట్ పంపించారు.

నల్లక్క చేటెడు నిండుకూ రాగులు పోసుకొని పెద్ద చేటలో తిరుగలి నుంచి దాని ముందు కూర్చున్నది. తిరుగలితో పాటూ ఆలోచనలు కూడా తిరుగు తున్నాయి. తేరు కదులుతుంటే పూలు రాలినట్లు తిరుగలి తిరుగుతుంటే పిండి రాలుతోంది.

"నలుగురు పిల్లలు గలవాడు. రెక్కాడితేనే గానీ డొక్కాడని పరిస్థితి. ఇన్ని సంవత్సరాలైనాయి గదా! ఏ ఒక్కర్నీ పల్లెత్తుమాటన్న పాపాన పోలేదు. నిండుకుండ లాంటి మనిషికి ఎంత శ్రమ వచ్చింది పాపం! అయ్యో దేవుడా!" అనుకుంటూ తనలో తాను ఆలోచించుకుంటున్నది నల్లక్క.

ఆ వూరి నుండి పోలీస్ స్టేషన్ అరమైలు కూడా లేదు. సమయానికి సబ్ ఇన్‌స్పెక్టర్ జె.డి. ఘనే స్టేషన్‌లో వుండటంవల్ల రిపోర్టు నందుకొన్నాడు. ఓ మారు

అటూఇటూ చూచి "ఏయ్ టు ఒన్ టు యు అండ్ ఒన్ ఫోర్ గెట్ రెడీ" అన్నాడు. రిపోర్టు తెచ్చిన మనిషి వంక తేరిపార జూచి "నువ్వు వెళ్లవోయ్! వెనకే వస్తున్నామని చెప్పు అన్నాడు.

మిష్టర్ జె.డి.ఘనే ఆ స్టేషన్‌కు వచ్చి ఏడాదిపై చిలుకైంది. అంత వరకూ అక్కడో కేసైనా పట్టుకోలేదు. దానికొక ప్రత్యేక కారణముంది. ఆ పల్లెటూళ్లో పోలీస్ స్టేషన్ ఎందుకు పెట్టారో తెలియదుగానీ ఒక ఖూనీ కూడా జరగదు. పోనీ కనీసం గాయాలు తగిలేలా కొట్టుకుంటారేమో ననుకొన్నా ఒకరి మీదొకరు చెయ్యి చేసుకోరు. దొంగతనాలు అసలే లేవు. ఉంటే గింటే చెరకుతోటలో పడి వోకగ్ర విరుచుకున్నాడనో, లేదా కొబ్బరి బొండాం దొంగిలించాడనో, లేక కరిబూజ కాయ కోసుకున్నాడనో కేసులుంటాయి. ఆ దొంగతనాలు స్టేషన్ దాకా రావు. వచ్చినా అందులో పరిశోధనేముంది? చేతినిండా పనేముంది? అందుకే జె.డి. ఘనే గోళ్లుగిల్లుకుంటూ కూర్చుంటాడు. మంచి మంచి డిటెక్టివ్ నవలలు చదివి పడుకొని కలలో కొత్త కొత్త అనుభవాలు పొందుతుంటాడు. ఒకనాటి రాత్రి కలలో వందమందికీ చెప్పాడు. "ఏదో పెద్ద పెట్టె పార్సెలు వచ్చిందట. ఆ పెట్టెను విప్పితే అందులో మొసలి మార్కు ముద్ర, దానితో పాటు క్రింద ముక్కూ చెవుల్లేని తల కన్పించిందట. ఆ మార్కును పరిశీలించి ఆ తలను పరిశోధించి తానో డిటెక్టివై చివరికి హంతకుణ్ని కనిపెట్టినట్టు తన పేరు పత్రికల్లో పడ్డట్టు, తన ఫోటో తనే చూచుకొన్నట్టు."

ఇలాంటి ఆలోచనలున్న వుడుకు రక్తం పొంగే మనిషి జె.డి.ఘనే. మిస్టర్ ఘనే తాత్కాలికంగా దొరికిన ద్విచక్ర శకటాన్ని ఆరోహించి టూ వన్ టూ, టూ వన్ ఫోర్లను తమ వెంట పరుగెత్తి రమ్మని ఎకాయెకిని కొండారెడ్డి గారింటి ముందు వచ్చి వాలాడు.

తక్షణం పెన్సిల్ అందుకొని నోట్‌బుక్ తెరచి ప్రశ్నల వర్షం ప్రారంభించాడు.

"మిస్టర్ రెడ్డిగారూ మీ పూర్తి పేరు ఏమన్నారూ?"

"శేషారెడ్డి కొండారెడ్డి."

"మీ వయస్సు?"

"అవన్నీ ఎందుకండీ?"

"అవసరం వుందండీ."

"అరవై."

"మీరీ వూరికి వచ్చి ఎన్నాళ్ళయింది?"

"అదేం ప్రశ్నండీ- అసలీ వూరు పుట్టినప్పటి నుండీ మా తాత లిక్కడే వున్నారు. వూరు ముందో, మేం ముందో!"

"సరి సరి వూళ్ళో మీకెవరైనా విరోధులున్నారా?"

"విరోధులా? మాకెవరున్నారు? ఎవ్వరూ లేరు?"

"మంచిదే- అసలు మనం కార్యక్రమంలోనికి దిగుదాం. మీరు ప్రొద్దున్న ఎన్ని గంటలకు లేచారు?"

"ప్రొద్దు పుట్టకముందే."

"ఐదు గంటలుంటాయా?"

"కావచ్చు."

"లేచిందే ఏం చేశారు?"

"ఏం చేస్తాం? పొలానికి వెళ్ళి వచ్చాం."

"అప్పుడు మీ చేతిలో వుంగరం వుందా?"

"ఆహా!"

"మళ్ళీ ఎక్కడికి వచ్చారు."

"ఇంటికే!"

"ఆ, వచ్చి?"

"వచ్చి తలంటుకోవాలని చిక్కణ్ణి రమ్మన్నాను."

"తలంటుకోవడమంటే ఏమిటండీ?"

"అదేం ప్రశ్నండీ? మీరెప్పుడూ తలకంటుకోలేదన్న మాట."

"అందుకే అడుగుతున్నా"

"నూనె తలకు మర్దిస్తారులెండి" అన్నాడు కరణంగారు.

"తలకంటుకొనేటపుడు చేతిలో వుంగరం ఎందుకు తీయవలసి వచ్చింది?"

"రాళ్లకు నూనె దిగుతుందనీ తీశాను."

"అసలు నూనె అంటడం తలకుగానీ చేతికి కాదుగా? ఐనపుడు నూనె చేతి వుంగరానికి ఎలా అంటుకుంటుంది?"

"నూనె ఒళ్లంతా తగుల్తుంది గదండీ?"

ఐయాం వెరీ సారీ! ఇది నమ్మదగిందిగా లేదు. మీరు మొదట చెప్పిందేమిటి? తలంటు కోవాలన్నారు గానీ చేతికంటుకొంటుం దంటున్నారు?"

"మీ కనుమానంగా వుంటే చిక్కణ్ణే అడగండి"

సబ్‌ఇన్‌స్పెక్టర్ జె.డి.ఘనే గారు సిగరెట్ కేస్ తీసి సిగరెట్‌ను పెదిమల మధ్య నుంచి క్షణం ఆలోచించి "మిస్టర్ చిక్కడూ జరిగింది జరిగినట్లు చెప్పు. ఏమీ భయపడకు. తలకంటుకొనేటపుడు నూనె చేతికెలా అంటుకొంటుంది? అసలు తలంటే వాడవు నీవు కదా? నీ చేతిలో వుంగరం తియ్యాలి గానీ ఆయన చేతిలో వుంగరం ఎందుకు తీయవలసి వచ్చింది."

"చిత్తం దొరగారూ! నూనె ఒంటికంతా కూడా పట్టిస్తామండి."

"దేర్ యు ఆర్. అలా చెప్పు. ఒళ్లు కూడా పట్టావన్న మాట. ఇప్పుడు చెప్పు. ఉంగరం తీసి ఎక్కడ పెట్టాడు?"

"ఈ కిటికీలోనండి?"

"నువ్వు చూచావా?"

"చూశానండీ!"

"ఒళ్లు పట్టాక నువ్వు కెక్కడికెళ్లావు?"

"కొంచెం కుంకుడు కాయలిమ్మని నల్లక్క నడిగానండీ."

"నల్లక్క ఎవరు?"

"మా ఇంటి దాసీది."

"ఆమెనిలా రమ్మనండి. నేను చూడాలి."

కరణంగారు గావుకేక పెట్టారు.

"ఒసేయ్ నల్లక్కా ఇలా వచ్చిపో?"

"వస్తా వస్తా! ఈ చేరెడు ఐపోనీ"

"వాటీస్ దిస్? చేరెడేమిటి చేరెడు" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

"రాగులండీ"

"రాగి. ఎకైండ్ ఆఫ్ ఫుడ్ - దాన్నేం చేస్తారు? మాల్టు చేస్తారు గదూ?"

"సంగటి చేస్తారండీ?"

"సంగటి. అదేమిటి?"

"అది ముద్దగా వుంటుందిలెండీ."

"ఓ-ఐసీ-పొలాల్లోకి తట్టల్లో పట్టుకెడుతారు గదూ."

"అవునండి."

"దెన్-వేరీజ్ దట్ నల్లక్క. ఏ టు ఒన్ టు గెట్ హర్ ఎట్ వన్స్"

నల్లక్క వచ్చి అక్కడ నిలబడింది. ఆమె నడుము మీద గంప నుంచుకొన్నది. మిస్టర్ జె.డి.ఘనే ఆమెను ఎగాదిగా చూచి "వో మై గుడ్ గాడ్. షి అప్పియర్స్ జస్ట్ లైక్ ఎ చెంచుభామ."

"ఏమిటండీ కరణంగారూ పిలిచారు?" అన్నది నల్లక్క.

"దొరగారు రమ్మన్నారు?'

నల్లక్క సబ్ఇన్స్పెక్టర్ వైపు తీక్షణంగా చూచి వంటగదిలోకి వెళ్ళిపోతుంటే ఇన్స్పెక్టరన్నారు.

"ఇదిగో అమ్మాయ్. ఈ చిక్కడికి కుంకుడుకాయ లిచ్చింది నువ్వేనా?"

"అవును."

"అప్పుడతని చేతిలో ఏముంది?"

"నూనె జిడ్డు"

"అది కాదమ్మాయ్? ఉంగరం వుండాలి."

"ఉంగరమా?"

"ఆ---"

"లేదు"

"ఇంకేముంది"

"ఇంకేమీలేదు."

"చెయ్యి కడుక్కున్నాక ఎక్కడి కెళ్లాడు?"

"వాళ్లింటికి"

"నేరుగా వెళ్లాడా? అటూ ఇటూ చూస్తూ వెళ్లాడా?"

"క్రింద చూచే నడిచిపోయాడండీ."

"ఐ-సీ- నువ్వు ఎన్నాళ్ల నుండి వున్నావిక్కడ?"

"పుట్టినప్పటి నుండీ"

"నీ వయస్సెంత?"

"అదేంమాట బాబూ! ఇచ్చీ తీసుకొనే వాళ్లలాగా"

"యు మస్ట్ ఆన్సర్ మి. ఎంత వయస్సు?"

"ఆ రచ్చ మీద వేపచెట్టుకూ, రావిచెట్టుకూ పెళ్లయినపుడు పుట్టానటండీ. మా అవ్వ చెప్పింది."

"వాట్! వాట్! అదెప్పుడు జరిగింది?"

"పాతికేళ్లు కావచ్చులెండి!"

"ఆ పెండ్లి ఎందుకు చేశారు? అసలు మనుషులకే పెండ్లి చేసేవాళ్లు లేకుంటే ఈ చెట్లకేమిటి పెండ్లి. ఇల్లిటరేట్స్."

"ఆ విషయం మమ్మల్నడిగితే మాకేం తెలుస్తుందండి. అలాగా పెళ్లిళ్లు అన్ని వూళ్లలోనూ చేస్తారు" అన్నాడు కరణంగారు.

"ఆల్ రైట్. పాతికేళ్లు. అంటే ట్వెంటీ ఫైవ్ : నువ్వు ఎన్ని గంటలకు వచ్చి పని ప్రారంభిస్తావు?"

"రెయ్యి, తెల్లవార్లూ, పొద్దస్తమానూ ఇక్కడే వుంటాను."

"నీకూ చిక్కనికీ బంధుత్వమా?"

"ఏందేంది? ఈసారి అనండీ ఆ మాట?" నల్లక్క వురిమి చూస్తూ లోపలికి వెళ్లిపోయింది.

"ఇల్లిటరేట్ బ్రూట్స్– ఏం చిక్కడూ నీకా అమ్మాయ్ ఏం కావాలి?"

"వాళ్లు వేరు మేము వేరు కులం దేవరా?"

"ఓహో! ఇప్పుడు నేరం నీమీద ఆరోపింపబడింది. నీ ఇంటిని సోదా చెయ్యాలి. ఎక్కడ మీ ఇల్లు?"

"ఆ చివర వుందండీ.'

"కరణంగారూ మీరూ రండి" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ సాగ బారాడు. టు ఒన్ టు ఆయన హేట్ తీసుకొన్నాడు. టు ఒన్ ఫోర్ ఆయన సిగరెట్ కేసు తీసుకొన్నాడు. మిస్టర్ జె.డి.ఘనే టక టకమని నడక ప్రారంభించాడు. ఆయన వీధిలో వెడుతుండగా ఆబాలగోపాలం వేయి కళ్లు చేసుకొని చూశారు.

"చిక్కని కొంప కాళీ అవుతుంది."

"పాపం జైలుకు పోతాడు."

"అపరాధం వేస్తారేమో."

"ఉంగరం ఇచ్చేస్తే వదిలేస్తారు" తలో మాట అంటున్నారు.

చిక్కన్న ఇంటివద్దకు వచ్చి ఆగాడు. అదొక చుట్టు గుడిసె. వెదురు బద్దల తడికను తొలగించి సబ్‌ఇన్‌స్పెక్టర్ లోపలికి అడుగు పెట్టబోతుంటే అప్పుడే బయట నుండి వచ్చిన చిట్టమ్మ అన్నది.

"బాబ్బాబూ! లోపల పేరంటాలుంది. చెప్పులు తీసి లోపలికి వెళ్లండి."

"వాట్"

"మీరేమైనా చెప్పండీ, చెప్పులు తీయకుండా లోపలికి అడుగు పెట్టనివ్వను."
చిట్టెమ్మ కడపకడ్డంగా నిలబడింది.

"అంతేనండి బూట్లు విప్పకుంటే లోపలికి పోనివ్వరు" అని నసిగాడు కరణంగారు.

"పోతే ఏమవుతుంది?" గర్జించాడు జె.డి.ఘనే.

ఉలిక్కిపడ్డాడు కరణం గారు. అదిరిపోయాడు చిక్కడు.

చిట్టెమ్మ అన్నదిగదా!

"దొరగోరూ, ఈ గొంతులో వూపిరి వుండేదాకా చెప్పులేసుకొని లోపలికి పోలేరయ్యో! ఇది కటారి చెంగని కూతురు. ఏం గల్లు కేస్తారా? అంటూ ముట్టూ, మంచి చెడ్డా లేకుండా ఇంట్లో కొస్తే పేరంటాలు మండిపోతుంది" అంటూ ప్రారంభించింది.

"ఐసీ" అంటూ కళ్లజోడు తీసి చేతి రుమాలుతో తుడిచి దానిని జేబిలో పెట్టుకుని బూట్లు విప్పాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

మిస్టర్ ఘనే అద్భుత పరిశోధన ప్రారంభమైంది. మూడు దొంతులూ క్రిందకు దించారు. ఒక దొంతి నిండుకూ చింతగింజలున్నాయి. రెండో దొంతి నిండుకూ వరిపొట్టూ సీతాఫలాలూ ఉన్నాయి. మూడో దొంతిలో గంపెడు వెంట్రుకలు, పాత క్షవరపు కత్తులు, చినిగిపోయిన అడపం కన్పించింది.

అటుక మీద ఒక సింగీతం. రెండు కొడాలు. ఒక కొయ్య పెట్టె నిండుకూ చిట్టి కోళ్ల వల కన్పించాయి. జె.డి.ఘనే సిగరెట్టు వెలిగించి గట్టి దమ్ము లాగి కాగుకు ప్రక్కనున్న గోడ గూటిలో చెయ్యి పెట్టాడు. చుర్రుమని అంటుకపోయింది చిటికెన వ్రేలు. వ్రేలు వెనక్కిలాగి పళ్లతో కొరికి "తేలు తేలు" అంటూ పొలికేక పెట్టాడు. ఆ గూటిలో నుండి తేలును బయటికి తీసేదెట్టా? చిక్కడు పరుగెత్తు కొంటూ వచ్చి ఒక పాత పేలికను లోపలికి దోపి బయటికి లాగాడు. ఒకటి గాదు రెండు తేళ్లు. కణికడేసి వున్న ఆ వృశ్చికాల చూచిందే మిస్టర్ ఘనే తేల కళ్లు వేశాడు.

పరిశోధన ఆగిపోయింది. పరిచర్య ప్రారంభమైంది. టు ఒన్ టు, టు ఒన్ ఫోర్ ఇద్దరూ చెరో విసనకర్ర తీసుకొని విసరడం ఆరంభించారు. కరణంగారు తేలుమందు పోసే జగ్గయ్య కోసం పరుగు తీశాడు. చిక్కడు గడగడలాడి పోతున్నాడు. చిట్టెమ్మ అయోమయావస్థలో పడిపోయింది.

ఐదు నిమిషాల కల్లా జగ్గయ్య పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతని చేతిలో ఏదో పచ్చి ఆకు ఉన్నది. “ఎక్కడ కుట్టిందండీ?” అడిగాడు జగ్గయ్య. భగ్గుభగ్గున మండిపోతున్న కుడిచేతి చిటికెన వేలిని చూపెట్టాడు మిస్టర్ జె.డి.ఘనే.

జగ్గయ్య ఏదో గొణుగుతూ తన కుడిచేతి చిటికెన వ్రేలి మీద ఆకుపసరు పిండుకొన్నాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యచకితుడై “వో మై గాడ్ అదేమిటయ్యా! నన్ను కుట్టింది. నీవు మందు వేసుకుంటున్నావ్” అని కేక పెట్టాడు.

“అదంతేలెండి. మనకు ఏ అవయవం మీద ఏ భాగంలో కుట్టిందో ఆ భాగంలో తన అవయవం మీద మందు పోసుకొంటే ఆ నొప్పి తగ్గిపోతుంది” అన్నాడు కరణంగారు విశదీకరించి.

“భేష్. ఏడ్చారు!వట్టి బ్రూట్స్” అంటూ పైకి లేచాడు మిస్టర్ ఘనే.

అతని నిరసనకు లోలోపల మండిపడ్డాడు జగ్గయ్య. “తేలుకాటుకు వైద్యం చేయడంలో తనకు పదేళ్ల అనుభవముంది. నోటికీ చేతికీ తాళం వేస్తూ వచ్చిన వారల్లా గలగలా నవ్వుతూ వెళ్లారు. ఈయనేమో నమ్మడు. ఉహు–ఈ దొరలంతా ఇంతేలే” అనుకుంటూ వెళ్లిపోయాడు జగ్గయ్య.

సబ్‌ఇన్‌స్పెక్టర్ గారు చిటికెన వ్రేలిని చప్పరించుకొంటూ కొండారెడ్డి గారింటికి వెళ్లారు. ఆయన అడుగుల్లో అడుగులు పెట్టుకొంటూ పోలీసులు కూడా వెళ్ళారు.

“మిస్టర్ కొండారెడ్డి గారూ! చిక్కణ్ని అరెస్టు చేస్తున్నాను. అనుమానం ధ్రువపడింది. కానీ ఆధారాలు సరిగ్గా లేవు. ఋజువు చేసుకోండి” అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

“అదెంత పనండీ. కావలసినంతమంది సాక్షులున్నారుగా” అన్నాడు కొండారెడ్డి గారు మీసం మెలివేస్తూ.

“నడవ్వోయ్ స్టేషన్‌కు” పిడుగులా విరుచుకుపడ్డాడు మిస్టర్ జె.డి.ఘనే.

“ఎందుకూ?” ఉరుములా విన్పించింది వంటగదిలో నుండి ఈ శబ్దం.

“ఓ నల్లక్కా! ఏమిటి కథ” అన్నారు కరణంగారు విస్తుపోతూ.

“చిక్కన్న దొంగిలించలేదు వుంగరాన్ని.”

“ఐతే ఇంకెవరు దొంగిలించారు” కర్కశంగా అన్నాడు కొండారెడ్డి.

“ఎవరూ దొంగిలించలేదు.”

'ఆ - అది నీ దగ్గరే వుందేమిటీ?" వ్యంగ్యంగా ప్రశ్నించాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

నల్లక్క కడపలో నిలబడి అన్నది. "నాకొక అనుమానం వుంది. మీరందరూ ఇక్కడే కూర్చోండి. పావుగంటలో ఏ విషయమూ చెపుతాను" అన్నది నల్లక్క.

కొండారెడ్డి ముక్కుమీద వేలుంచుకొన్నాడు. ఏదో రహస్యం వుందను కొన్నాడు సబ్‌ఇన్స్‌పెక్టర్. చిటికెన వ్రేలిని చప్పరిస్తూ కుర్చీలో కూలబడి "నీకు సహాయంగా పోలీసులు కావాలా" అన్నాడు.

నల్లక్క ఆ మాటను వినిపించుకోకనే ఇంటికీ వాకిటకూ నాలుగు మార్లు తిరిగింది. ఆమె ఎవరిని వెతుకుతున్నదో ఒక్కరికీ అర్థం కాలేదు. కానీ ఏదో కృతనిశ్చయంతో వున్నట్టుంది.

"ఏమిటీ ఈ వూళ్లో నల్లక్క గూడా పెద్ద డిటెక్టివ్ అయిపోతున్నట్టుందే" అన్నాడు మిస్టర్ ఘనే నవ్వుతూ.

"డిటెక్టివ్ అంటే ఏమిటండీ" అమాయకంగా ప్రశ్నించాడో రైతు.

"అదొక బిరుదులే" అన్నారు కరణం గారు.

"కాదు డిగ్రీ" అన్నాడో యువకుడు.

నల్లక్క గబగబా లోపలికి వెళ్ళి గుప్పెడు నిండుకూ ఏదో పట్టుకుని మళ్లీ బయటకు వచ్చింది. అందరూ చూస్తుండగానే పెరటిలోకి వెళ్లింది. టు ఒన్ టూ వుండబట్టలేక ఆమె వెంబడే వెళ్లాడు. ఆమె "బో బో బో బో" మంటూ మళ్లీ లోపలికి వచ్చింది.

"వాటీజ్ ది మీనింగ్ ఆఫ్ బో బో- ఈజి ఇట్ ఎ మంత్రం?" అన్నాడు మిస్టర్ ఘనే.

"కాదండి - కోడిని పిలుస్తోంది" అన్నాడు కరణంగారు.

"అయాం వెరీ సారీ. నేను వెజటేరియన్ని" అంటూ పైకి లేచాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

కొండారెడ్డి గారికి అర్థమైపోయింది. దొరగారికి కోడిని కోసి వండిపెట్టి ఏదో తారుమారు చేయాలనుకొన్నది నల్లక్క అనుకొన్నాడు.

"ఏందే చెప్పి ఏడవక పోయావూ?" అంటూ గద్దించాడు.

"ఉండండి అయ్యగారూ! ఐదు నిమిషాల్లో ఉంగరం విషయం తేల్చేస్తాను" అంటూ కొక్కరిస్తూ దగ్గరికి వచ్చిన కోడిపుంజును పట్టుకొన్నది నల్లక్క.

కోడిపుంజు మెడ క్రింద వున్న బొండను పిసికి " ఉంది... ఉంది" అంటూ

ఇల్లెగిరిపోయేలా అరిచింది నల్లక్క. సబ్‌ఇన్‌స్పెక్టర్ స్తబ్ధుడై మూడు క్షణాలకు తేరుకొని "ఎక్కడుంది" అంటూ దగ్గరకు వచ్చాడు.

"ఇదో పట్టి చూడండి. చేతికి తగులుతుందంటూ కోడిని అందివ్వబోతే మిస్టర్ ఘనే "చూడవోయ్ ఏమిటీ నాన్సెన్స్!" అంటూ టూ ఒన్ టూ వంక చూచాడు. అతడు కోడిపుంజు నందుకొని బొండను తడివి చూచి "ఉంది లెండి" అన్నాడు.

మిస్టర్ ఘనే నమ్మలేక కుర్చీలో చేరగిలబడి పై కప్పును చూస్తూ –

"మిస్టర్ రెడ్డి గారూ! మీరు చెప్పండి. ఆ కోడి గొంతులో ఉంగరం ఉందా?" అన్నాడు.

కొండారెడ్డి గారు కోడినందుకొని బొండం పట్టి నలిపి "అరె ఉందే" అంటూ కసుక్కున నవ్వాడు.

"వండర్! వండర్! మార్వెలస్. మైడియర్ నల్లక్క డిటెక్టివ్ నల్లక్క! ఏదీ ఉంగరాన్ని చూపిస్తారూ?" అంటూ పైకి లేచి అన్నాడు మిస్టర్ ఘనే.

చిటికెలో కోడిని ఖూనీ చేసింది నల్లక్క. గొంతు క్రింద బొండను బయటికి తీసి బాకుతో రెండు బద్దలు చేసింది. అద్భుతం! అపూర్వం! అమోఘం! ఆశ్చర్యం! ఎగిరి గంతేశాడు సబ్‌ఇన్‌స్పెక్టర్ మిస్టర్ జె.డి.ఘనే. "ఒహోహో! వాట్ ఎ ట్రమండస్ ఇన్‌వెస్టిగేషన్! సస్పెన్స్! సస్పెన్స్! ఎవ్విరిమూవ్ మెంట్ విత్ సస్పెన్స్... ఓ డిటెక్టివ్ నల్లక్కా! నీ సాటి రాగల డిటెక్టివ్‌లు ఈ జగత్తులో లేరు. కేవలం ఒకే కోడిని ఖూనీ చేసినా అది తప్పుకాదు. చట్టం అనుమతిస్తుంది. నీ అద్భుత పరిశోధనా శక్తి ఎవరికుంది? నీ అఖండ మేధా సంపత్తి ఏ డిటెక్టివ్‌కు ఉండి ఏడ్చిందీ! ఆహా! కనీసం ఒక్క చుక్క పెట్రోలు నష్టం లేకనే, ఒక సిగరెట్టునైనా కాల్చకనే, ఒక్క ఫర్లాంగైనా నడవకనే, ఏ శిథిల గృహమూ పరిశీలించకనే, కనీసం కాలు కదపకనే, ఉన్న చోటనే ఉండి దొంగను కనిపెట్టావు. ట్రమండస్... ట్రమండస్! నీ పరిశోధన చరిత్రలోనే అపూర్వం. ఈ ఒక్క ఇన్సిడెంటు చాలు. నీ ఖ్యాతి ఖండ ఖండాలు వ్యాపించడానికి.

"ఓ మైడియర్ నల్లక్కా, ఒహో డిటెక్టివ్ నల్లక్కా! నీకు నా హార్టీ కంగ్రాచ్యులేషన్స్, నీ కీర్తి భూనభోంతరాళాలు వ్యాపించుగాక!

"ఎలా తెలుసుకున్నావ్? ఏ విధంగా వూహించావ్!" అరగంట అనర్గళంగా ఉపన్యసించాడు మిస్టర్ జె.డి.ఘనే. నల్లక్క అలాగే స్తబ్ధురాలై నిలబడిపోయింది.

ఉపన్యాసం ముగిశాక "అదేం మాటలు అయ్యగారూ! ఒక్కటీ అర్థం కావు" అంటూ గుప్పెడు పొగాకు దుగ్గు తీసి పుక్కిటి కెక్కించింది.

మిస్టర్ ఘనే మరొక సిగరెట్టు ముట్టించి "మిస్టర్ చిక్కడూ! ఐయాం వెరీ సారీ. ఎక్స్యూజుమి ఇంక వెళ్లవచ్చు" అన్నాడు.

కొండారెడ్డి గారు ముద్దుటుంగరాన్ని వ్రేలికి తగిలించుకున్నాడు. మిస్టర్ ఘనే సెలవు తీసుకొని తన ద్విచక్ర శకటాన్ని అధిరోహించాడు. డిటెక్టివ్ నల్లక్క సబ్ఇన్స్పెక్టర్ అమాయకత్వానికి మెల్లగా నవ్వుతూ వంటగదిలోకి వెళ్లిపోయింది.